సాక్షి
ప్రకాశం
సోమవారం । 11 । నవంబర్ । 2024



నిఘా నీడలో వసూళ్లు!

దర్శిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు వ్యాపారుల నుంచి నగదు వసూలు చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి ఆ బాధ్యతలు పోలీసులకే అప్పగించడం విశేషం. - 8లో..



పెళ్లి బస్సును ఢీకొన్న లారీ

ఆగి ఉన్న పెళ్లి బస్సును లారీ ఢీకొనడంతో 10 మందికి గాయాలయ్యాయి. మిట్టమీదిపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శని వారం అర్ధరాత్రి జరిగింది. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
35/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు, రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షునిగా బొట్ల సుబ్బారావు



నియామక పత్రం అందుకుంటున్న బొట్ల సుబ్బారావు

ఒంగోలు వన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షునిగా బొట్ల సుబ్బారావును నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లాకా వెంగళరావు ఆదివారం నియామక ఉత్తర్వులు అందజేశారు. శ్రీశైలంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు బీసీలను రాజకీయంగా వాడుకొని వదిలేస్తున్నారన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. బొట్ల సుబ్బారావు బీసీల సమస్యలపై పలు కార్యక్రమాలను నిర్వహించి పరిష్కరించారన్నారు. ఈ సందర్భంగా పలువురు సుబ్బారావును అభినందించారు. కార్యక్రమంలో సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి పిన్నిక లక్ష్మీ ప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ జమున

ఒంగోలు టౌన్: ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా డాక్టర్ జమున బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆమె అన్నమయ్య జిల్లా మదనపల్లి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ భగవాన్ నాయక్ ఏప్రిల్‌లో రిటైర్డ్ అయ్యారు. అప్పటి నుంచి ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో సైకాలజీ హెచ్ఓడీగా పనిచేస్తున్న డాక్టర్ దుర్గాదేవిని ఇన్‌చార్జి సూపరెండెంట్‌గా నియమించారు. సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ జమునను ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, డిప్యూటీ సూపరింటెండెంట్‌గా డాక్టర్ నామినేని కిరణ్ అభినందనలు తెలిపారు. పలు విభాగాలకు చెందిన హెచ్ఓడీలు, అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆస్పత్రికి వచ్చే నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

పోక్సో కేసుపై డీఎస్పీ విచారణ



పాఠశాలలో విచారణ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ, ఎస్సై, డీసీడీఓ

టంగుటూరు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతున్న బాలికపై ఉపాధ్యాయుడు లైంగిక దాడికి పాల్పడటంతో పోక్సో కేసు నమోదైన విషయం విదితమే. ఈ కేసు విచారణ నిమిత్తం ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆదివారం గ్రామంలో పర్యటించారు. డీఎస్పీ సంఘటన జరిగిన పాఠశాల స్థలాన్ని పరిశీలించి బాధిత బాలికకు చెందిన ఇద్దరు స్నేహితులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. ఇంకా లోతైన దర్యాప్తు చేసి నిందితునిపై చట్టపర చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్సై నాగమల్లేశ్వరరావు, మహిళా ఎస్సై అనిత, డీసీడీఓ మాధవీలత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

అమరవీరుల త్యాగాలు మర్చిపోం

మార్కాపురం: విధి నిర్వహణలో అమరులైన అటవీ ఉద్యోగుల త్యాగాలు మర్చిపోమని, వారిని స్ఫూర్తిగా తీసుకొని నిబద్ధతతో పనిచేయాలని మార్కాపురం అటవీశాఖ ఎఫ్ఆర్ఓ బి.వరప్రసాద్ అన్నారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఆదివారం స్థానిక డీఎఫ్ఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులను, వన్యప్రాణులను సంరక్షించే క్రమంలో పలువురు అటవీ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారన్నారు. అటవీ సంరక్షణ బాధ్యత ఉద్యోగులతో పాటు ప్రజలపై కూడా ఉందన్నారు. కార్యక్రమంలో గంజివారిపల్లి ఎఫ్ఆర్ఓ ఎస్వీ సుబ్బారావు, విజయపురి సౌత్ ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ పీవీ నరసింహారావు, ఏఓ ఖాజా మొహిద్దీన్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు నాగరాజు, రామ్మోహనరావు, ఫిలిప్, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సిబ్బంది ఆత్మకు శాంతి కలగాలని నివాళులు అర్పించారు.

స్వపక్ష విలాపం..
మిత్రపక్ష ఖేదం..!

రెండో విడత నామినేటెడ్ పదవులు పంపకంపై కూటమి పార్టీ నేతల్లో అసంతృప్తి రాజుకుంటోంది. దశాబ్దాలుగా పార్టీ జెండాను మోసిన వారికి మొండిచెయ్యి ఇచ్చారంటూ టీడీపీ నేతలు రగిలిపోతున్నారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతున్న తమను చిన్నచూపు చూస్తూ కనీస అర్హత లేని వారికి పదవులు ఎలా ఇస్తారంటూ మండిపోతున్నారు. నాలుగు దశాబ్దాలుగా పార్టీ కోసం రూ.కోట్లు ఖర్చు చేసి అండగా ఉన్న తన భర్తకు ఎందుకు పదవి ఇవ్వలేదని ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన నేత భార్య వీడియో.. జిల్లాలో సంచలనం రేకెత్తిస్తోంది. పార్టీలోని సీనియర్ నాయకుల దుస్థితికి అద్దం పడుతోందని సైకిల్ పార్టీ నేతలు రగిలిపోతున్నారు. ఇక మిత్రపక్షాలకు ఎప్పటిలాగే మొండిచేయే మిగిలింది. జనసేనకు ఇచ్చిన పదవి ఏ జిల్లా కోటాలో ఇచ్చారో తెలియక ఆ పార్టీ నేతలు తికమక పడుతున్నారు. బీజేపీకి ఒక్క పదవీ ఇవ్వలేదు. ఇదేమి మిత్ర ధర్మమంటూ ఇరుపార్టీల నేతలు ప్రశ్నిస్తున్నారు.

- రెండో విడత భర్తీపై టీడీపీ, జనసేనల్లో అసంతృప్తి
- సీనియర్లకు మొండిచేయి చూపారంటూ టీడీపీ నేతల మండిపాటు
- సంచలనం రేపుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ భార్య వీడియో
- రియాజ్, రాయపాటి అరుణ వర్గాల్లో నైరాశ్యం
- ఎప్పటిలాగే బీజేపీకి మొండిచేయి



సాక్షి ప్రతినిధి, ఒంగోలు :

రెండో విడత నామినేటెడ్ పోస్టుల భర్తీ జిల్లాలోని కూటమి పార్టీల్లో చిచ్చు రేపుతోంది. పదవులపై ఆశలు పెట్టుకున్న తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీ నాయకులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం ఏళ్ల తరబడి పని చేసిన వారిని కాదని పైపై షోకులు చేసిన వారికి పదవులు కట్టబెట్టారని బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు. సెప్టెంబర్‌లో మొదటి విడత నామినేటెడ్ పదవుల భర్తీలో జిల్లాకు చెందిన నలుగురికి పదవులు దక్కాయి. కొండపి నియోజకవర్గం నుంచి దామచర్ల సత్య, నూకసాని బాలాజీ, యర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి డాక్టర్ గౌతంరాజు, ఒంగోలు నుంచి లంకా దినకర్‌లకు నామినేట్ పదవులను కట్టబెట్టారు. నాడు పదవుల రాని వారంతా రెండో విడత పదవులు భర్తీ కోసం ఆశగా ఎదురుచూశారు. శనివారం రెండో విడత జాబితా కూడా విడుదలైంది. ఈ సారి జిల్లా నుంచి నలుగురికి చోటు దక్కింది. అయితే పార్టీతో పెద్దగా సంబంధాలు లేని నాయకులకు పదవులు కట్టబెట్టడంతో టీడీపీలోని సీనియర్ నాయకులు నిరాశకు లోనయ్యారు.

లక్ష్మీ, ఎరిక్షన్ బాబుల సంగతేంటి...

గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, యర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు తమకు ఏదైనా కార్పొరేషన్ పదవి వస్తుంది ఆశతో ఉన్నారు. అయితే తొలి విడతలో వీరికి పదవులు లభించలేదు. సరికదా రెండో విడతలోనూ మొండిచెయ్యే మిగిలింది. దాంతో ఈ నాయకుల పరిస్థితి ఏమిటో అర్థం కాకుండా తయారైంది. దర్శి ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న లక్ష్మి వైఖరిపట్ల ముఖ్యమంత్రి సంతృప్తిగా లేరని తెలుస్తుంది. దాంతో ఆమెకు కార్పొరేషన్ పదవిని ఇవ్వడానికి సీఎం అంగీకరించలేదని ప్రచారం జోరుగా సాగుతోంది.ఇక ఎరిక్షన్‌బాబు మీద విపరీతమైన అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. పార్టీలో గ్రూపులను ప్రోత్సహిస్తుండడం, సీనియర్ నాయకుడు డాక్టర్ రవీంద్రతో సఖ్యత లేకుండా వ్యవహరించడం వెరసి ఎరిక్షన్ పదవికి గండం తెచ్చిపెట్టిందని ఆ పార్టీ నాయకులు చెవులు కొరుక్కుంటున్నారు.

తేజస్వీకి పదవా..?

కూటమి రెండో జాబితాలో పాడపాటి తేజస్వికి ఏపీ కల్చరల్ కమిషన్ చైర్ పర్సన్‌గా నియమించడంపై జిల్లా తెలుగుదేశం పార్టీలో చిచ్చురాజేసింది. ఎలాంటి అర్హత లేని ఆమెకు పదవి ఇవ్వడంపై పార్టీలో తీవ్ర వ్యతిరేక వ్యక్తమవుతోంది. స్కిల్ కుంభకోణం కేసులో చంద్రబాబును అరెస్టు చేసినప్పుడు తేజస్వి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో నిరసన ప్రదర్శనలు చేయించినదానికి ప్రతిఫలంగా ఆమెకు కార్పొరేషన్ చైర్మన్ పదవిని కట్టబెట్టినట్లు అధికార పార్టీ చెప్పుకుంటోంది. అంతకు మించి ఈమెకు పార్టీతో పెద్దగా సంబంధాలు లేవు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న దాఖలాలు లేవు. కేవలం పార్టీ సామాజిక వర్గానికి చెందిన మహిళ కావడం వల్లే తేజస్వికి పదవి ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రపోజ్ చేయడం వల్లనే పదవి కట్టబెట్టారని చెప్పుకుంటున్నారు. పార్టీ కోసం 40 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారిని వదిలిపెట్టి నిన్నగాక మొన్న వచ్చిన తేజస్వినికి పదవిని ఇవ్వడమేంటని పలువురు నాయకులు దామచర్లకు ఫోన్లు చేసి ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తుంది. ఇది పార్టీకి ఎంతమాత్రం మేలు చేయదని వారు దామచర్ల ముఖం మీదే చెప్పినట్లు ప్రచారం జరుగుతుంది. మార్కాపురం మండలానికి చెందిన జీవీ రెడ్డికి ఏకంగా ఏపీ ఫైబర్ నెట్ లిమిటెడ్ చైర్మన్ పదవిని కట్టబెట్టడం పట్ల టీడీపీ సీనియర్ నాయకులు విస్తుపోయారు. మార్కాపురంలో 40 ఏళ్లుగా పార్టీ కోసం పని చేస్తున్న శాసనాల వీరబ్రహ్మం, గునిపూడి భాస్కర్ ఉన్నారు. అలాంటి వారిని పక్కన పెట్టి నేరుగా పార్టీతో ఎలాంటి సంబంధాలు లేని వారికి పదవులు ఇవ్వడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు.

సంచలనం సృష్టిస్తున్న మాధవి వీడియో...



గునుపూడి మాధవి


మార్కాపురం నియోజకవర్గం పొదిలికి చెందిన గునుపూడి భాస్కర్ భార్య మాజీ ఎంపీటీసీ మాధవి విడుదల చేసిన వీడియో జిల్లాలో సంచలనం సృష్టిస్తోంది. 'గునుపూడి భాస్కర్ గత 42 ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్నారని, కోట్ల రుపాయలను, వయసును పార్టీ కోసం ధారపోశారని, ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా పార్టీకి అండగా నిలబడ్డామని' ఆమె వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ఆర్యవైశ్యులందరినీ ఒకతాటిపైకి తీసుకొచ్చి పార్టీ విజయానికి కృషి చేశారని, పార్టీ కోసం ఎంత పనిచేస్తే మీరు గుర్తిస్తారో చెప్పాలని ఆమె చంద్రబాబును ప్రశ్నించారు. మీరు ఎప్పుడు తగిన పదవిని ఇస్తారో చెప్పాలని నిలదీశారు. భాస్కర్‌కు మొదటి జాబితాలోనే పదవి వస్తుందని ఆశించామని, కనీసం రెండో జాబితాలోనైనా పదవి వస్తుందను కుంటే ఈసారి మొండిచేయి చూపారని ఆమె విమర్శించారు. ఆర్యవైశ్య కుటుంబంలో పుట్టడమే మేం చేసిన తప్పా అని ప్రశ్నించారు. నిజానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ పదవిని జిల్లాకు చెందిన కుప్పం ప్రసాద్‌కు ఇచ్చింది. అలాగే మరొకరికి టీటీడీలో స్థానం కల్పించింది. కార్పొరేషన్ పదవే కాకుండా ఆర్యవైశ్యులకు ఎలాంటి పదవులు ఇవ్వకపోవడంపై ఆ సామాజిక వర్గంలో వ్యతిరేకత వ్యక్తం అవుతుంది.

రియాజ్‌కు పదవి రాకుండా అడ్డుకున్నదెవరు...

జిల్లా నుంచి నామినేటెడ్ పదవులను ఆశిస్తున్న జనసేన నాయకులు రెండో జాబితా చూసి నీరుగారిపోయారు. జనసేన కోటాలో పర్చూరు సమన్వయకర్త పెదపూడి విజయకుమార్‌కు ఏపీ మాల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇచ్చారు. ఇది ఎవరూ ఊహించలేదు. జిల్లాలో జనసేన అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి విడతలోనే వీరికి పదవులు రావడం ఖాయమని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. తొలి విడత జాబితాలో వీరికి పదవులు దక్కలేదు. తదుపరి భర్తీలో వీరికి పదవులు ఇస్తామని పార్టీ నేతలు చెప్పారు. ఇప్పుడు రెండో జాబితాలో కూడా పదవులు దక్కలేదు. వీరికి పదవులు దక్కకపోవడంపై రకరకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. రెండో జాబితాలో రియాజ్ పేరును దామచర్ల ప్రస్తావించగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అభ్యంతరం చెప్పినట్లు సమాచారం. ప్రస్తుతం రియాజ్ మంగళగిరి పార్టీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు సమాచారం. ఇక జనసేన సెంట్రల్ ఆంధ్ర కన్వీనర్ చీకటి వంశీదీప్, కనిగిరి సమన్వయకర్త వరికూటి నాగరాజు కూడా పదవులు ఆశిస్తున్నారని తెలుస్తుంది. ఆ పార్టీకి చెందిన కాపు నాయకులు గిద్దలూరు సమన్వయకర్త బెల్లంకొండ సాయిబాబా, దర్శి ఇన్‌చార్జి బొద్దుకూరి రమేష్, సంతనూతలపాడు ఇన్‌చార్జి కందుకూరి బాబు, ఒంగోలు కార్పొరేటర్ మలగా రమేష్ ఉడా పదవిని ఆశిస్తున్నట్లు చెబుతున్నారు. ఇక పెదపూడి విజయకుమార్ బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ జనసేన సమన్వయకర్తగా పనిచేస్తున్నారు. ఆయనకు ప్రకాశం జిల్లా కోటాలో పదవినిచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. ఇది జనసేన నాయకులకు మింగుడు పడడం లేదు.

టీచర్లకు యాప్ కష్టాలు

- పలు రకాల యాప్‌లలో వివరాల నమోదులో అవస్థలు
- పాఠాలు చెప్పడం కంటే మరుగుదొడ్ల ఫొటోలు, ఇతర ఫొటోలు అప్‌లోడ్‌తోనే సరి
- సర్వర్ సమస్యలతో అవస్థలు
- 60 శాతం కూడా పూర్తికాని సిలబస్
- అపార్ నమోదుకు అవాంతరాలెన్నో?
- శిక్షణలతో పాఠాలకు దూరం



జిల్లాలో పాఠశాలలు	విద్యార్థులు	ఉపాధ్యాయులు
3104	3,75,757	14500

బాలురు :	బాలికలు :
1,92,358	1,83,399

ఒంగోలు సిటీ : మరుగుదొడ్లు శుభ్రం చేశారా? లేదా? వాటి పరిస్థితి ఎలా ఉంది. మధ్యాహ్న భోజన వంటకాలు, విద్యార్థులకు వడ్డిస్తున్న ఫొటోలు పంపడం..వన్ నేషన్..వన్ కార్డు (అపార్)లో విద్యార్థుల వివరాల నమోదు.. ఇవీ ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయులతో చేయిస్తున్న పనులు. పాఠాలు చెప్పాల్సిన అయ్యోర్లు ఈ పనులతో బిజీగా ఉండడంతో చదువులు అటకెక్కుతున్నాయి. ఈ పాటికే ఉన్నత పాఠశాలల్లో సిలబస్ 90 శాతం పూర్తి చేసి డిసెంబర్ నుంచి రివిజన్ చేయాల్సి ఉంది. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో జిల్లాలో 60 శాతం సిలబస్ కూడా పూర్తి కాలేదని తెలుస్తోంది.

జిల్లాలో 3104 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. 3,75,757 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 14,500 మంది ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారు. విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేయాల్సిన టీచర్లకు పలు రకాల యాప్‌ల కష్టాలతో చదువులు చెప్పే పరిస్థితి కనిపించడం లేదు. దీనికి తోడు సబ్జెక్ట్ టీచర్ల కొరతతో విద్యార్థుల పరిస్థితి అగమ్యంగా మారింది. ముఖ్యంగా పశ్చిమ ప్రకాశం మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, దర్శి, కనిగిరి తదితర నియోజకవర్గాల్లో టీచర్ల కొరతతో సిలబస్ ముందుకు సాగడం లేదు. ఇవి చాలవన్నట్టు వివిధ రకాల శిక్షణ తరగతులతో ఉపాధ్యాయులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉపాధ్యాయులకు మరింత కష్టాలు పెరిగాయని వివిధ ఉపాధ్యాయ సంఘాలు వాపోతున్నాయి.

ఉపాధ్యాయుడు పాఠశాలలోకి వచ్చిన వెంటనే ఫేషియల్ అటెండెన్స్, విద్యార్థుల హాజరుకు సంబంధించి వివరాలు యాప్‌లో నమోదు చేయాలి. విద్యార్థుల హాజరును ఉదయం 9.30 లోపు యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. అయితే ఆలస్యంగా వచ్చిన వారి వివరాలు యాప్‌లో నమోదు చేయలేని పరిస్థితి నెలకొంది. ఇది ముగిసిన తర్వాత మరుగుదొడ్ల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. ప్రతి రోజూ ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించి వారు ఆ రోజు తీసుకుంటున్న పిరియడ్ల వివరాలను మూడుసార్లు ఆయా పాఠశాల హెచ్ఎంలు 'టీచ్‌టూల్ యాప్'లో నయోదు చేయాల్సి ఉంటుంది. అలాగే విద్యార్థుల అసెస్‌మెంట్ టెస్ట్ మార్కులను ప్రతి తరగతి ఉపాధ్యాయుడు 'ఫేషియల్ అటెండెన్స్'యాప్‌లో ఎంటర్ చేయాలి. ఇక మధ్యాహ్న భోజనానికి సంబంధించి ఐఎంఎంఎస్ యాప్‌లో గుడ్లు, చిక్కీస్, భోజనం వడ్డింపు తదితర వివరాలను అప్‌లోడ్ చేయాలి. క్రీడలకు సంబంధించి అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో ఆటల పోటీల వివరాలను నమోదు చేయాలి. చాలా సందర్భాల్లో సర్వర్, మొబైల్ నెట్‌వర్క్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో వారు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు.

టీచర్లతో మరుగుదొడ్ల ఫొటోలా..

ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు ప్రతి రోజు ఉదయం 8 గంటలకు, 11 గంటలకు, మధ్యాహ్నం 1 గంట, రెండు గంటలకు మరుగుదొడ్లను శుభ్రం చేయాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి ఫొటోలను సమీప సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, స్కూలు అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అయితే వారు దీనికి దూరంగా ఉండడంతో ఉపాధ్యాయులే ఈ పనిని చేస్తున్నారు. ఆయాలతో పనిచేయించుకుంటున్నారేగానీ వారికి సకాలంలో జీతాలు ఇవ్వని పరిస్థితి జిల్లాలో నెలకొంది.

శిక్షణలతో పాఠాలకు దూరం..

వివిధ రకాల శిక్షణ తరగతులతో ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. సకాలంలో సిలబస్ పూర్తి చేసే విషయంలో ఇబ్బందులు పడుతున్నారు. చాలా చోట్ల మొక్కుబడిగా పాఠాలు చెబుతూ మమ అనిపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.10వ తరగతి వారికి డిసెంబర్ నాటికి సిలబస్ పూర్తి చేసి రివిజన్ ప్రారంభించాల్సి ఉంది. అలాగే పబ్లిక్ పరీక్షలకు ముందస్తు ప్రణాళికను ఇవ్వాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో ఆ పరిస్థితి లేదు. అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటి వరకూ 60 శాతం సిలబస్ కూడా పూర్తికాలేదు. నెలరోజుల్లో సిలబస్ పూర్తి అయ్యే పరిస్థితులు కనిపించడం లేదని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. సిలబస్ పూర్తి చేసి చదువుల్లో వెనుబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించే పరిస్థితి కూడా కనిపించడంలేదు.

అపార్ కష్టాలెన్నో..

వన్ నేషన్..వన్ కార్డు పేరుతో కేంద్రం ప్రవేశపెట్టిన అపార్ కార్డు జారీ ప్రక్రియలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధాయులు అవస్థల పాలవుతున్నారు. తొలుత 9, 10 తరగతుల వారికే అని చెప్పారు. ఆ తర్వాత 1వ తరగతి నుంచి పదో తరగతి వరకూ విద్యార్థుల అపార్ ఐడీ జనరేట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆధార్ వివరాలు, స్కూలు రికార్డ్స్‌లో ఉన్న వివరాలు తేడా ఉండడంతో అవస్థలు పడుతున్నారు. దీనికి పుట్టిన తేదీ సర్టిఫికెట్ తేవాలని చెబుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులకు కొత్త కష్టాలు వచ్చిపడుతున్నాయి. ఆధార్ వివరాలు అప్‌డేట్ కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి. దీంతో 50 శాతం కూడా ఐడీ జనరేట్ కావడంలేదు.

ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: అధికారంలోకి వస్తే పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం..మాట నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా నాయకుడు కొత్తకోట వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఈనెల 18న గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ఆందోళనా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆందోళన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు సిమెంట్, ఇసుక, ఇనుము, ఇటుకలను ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కరెంటు చార్జీలు పెంచమని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత మాటమార్చి కరెంట్ చార్జీలను పెంచడం ప్రజలను దగా చేయడమేనన్నారు. ప్రజలపై కరెంట్ చార్జీల భారాన్ని తగ్గించాలని కోరారు. నగర పాలక సంస్థలో రిజిస్ట్రేషన్ చేయించుకొని డబ్బులు చెల్లించిన వారందరికీ టిట్కో ఇళ్లు ఇవ్వాలన్నారు. ఈ నెల 18వ తేదిన నగరంలోని ఇళ్లు లేని పేదలందరూ ఆయా ప్రాంతాల్లోని సచివాలయలలో దరఖాస్తులను అందజేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై కమ్యూనిస్టు పార్టీ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని చెప్పారు. పార్టీ నాయకులు శ్రీరాం శ్రీనివాసరావు, ఇన్‌సాఫ్ నాయకులు ఎంఏ సాలార్ , భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు హరికృష్ణ పాల్గొన్నారు.

భైరవకోనకు పోటెత్తిన భక్తులు



త్రిముఖ దుర్గాదేవి మూల విగ్రహమూర్తి




త్రిముఖ దుర్గాదేవి ఆలయ పూజల్లో వైవీ భద్రారెడ్డి, నాయకులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం భైరవకోనకు ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు త్రిముఖ దుర్గాదేవి, కాలభైరవ, నగరేశ్వర, భర్గులేశ్వర ఆలయాల్లో నిర్వహించిన విశిష్ట పూజల్లో పాల్గొన్నారు. అనంతరం జలపాతాన్ని సందర్శించి ఉత్సాహంగా గడిపారు. భైరవకోన క్షేత్రాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు, అద్దంకి ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి, స్థానిక వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.బుజ్జి, కాంతరెడ్డితో కలిసి సందర్శించి పూజలు నిర్వహించారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం, వసతి సమకూర్చారు. కార్తీక పౌర్ణమి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ తెలిపారు.



భైరవకోనలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ప్రకృతి కాంత.. సోయగాల తుళ్లింత

ప్రకృతి అందమంటే పైటేసిన పల్లెపడుచు చందం! సరళతతో కూడిన ప్రకృతి సౌందర్యం కృతజ్ఞతా భావాన్ని పెంపొందించే ఓ బహుమానం. ఆదివారం పడమటి కొండల్లో అస్తమిస్తున్న సూరీడు కంభం చెరువుకు సొబగులద్దుతూ సేదతీరిన దృశ్యం ప్రకృతి ప్రేమికుల మనసును రంజింపజేసింది. - ఫొటోలు : ఎం.ప్రసాద్, సాక్షి, ఒంగోలు

క్లుప్తంగా

17 నుంచి సీసీ కెమెరా సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: రూడ్ సెట్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ నుంచి సీసీ కెమెరా, స్మోక్ డిటెక్టర్ ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన పురుషులు అర్హులని స్పష్టం చేశారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో సంస్థ కార్యాలయంలో లేదా 9492583484ను సంప్రదించాలని సూచించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి


మృతి చెందిన ఏడుకొండలు

పొదిలి రూరల్: ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పొదిలి మండలంలోని మల్లవరం సచివాలయం సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పొదిలి నుంచి దర్శి వైపు వెళ్తున్న పాల ఆటో, పొదిలి వైపు వస్తున్న ద్విచక్ర వాహనం మార్గమధ్యంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కంభాలపాడు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఏడుకొండలు(33) అక్కడికక్కడే మృతి చెందగా, కొనకనమిట్ల మండలం వద్దిమడుగు గ్రామానికి చెందిన చెన్నుబోయిన బాలకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

బైక్ అదుపుతప్పి మహిళ..

యర్రగొండపాలెం: బైక్ అదుపుతప్పి ఒకరు మృతి చెందిన సంఘటన ఆదివారం వైపాలెం మండలంలోని మెట్టబోడు తండా హైవే రోడ్డుపై చోటుచేసుకుంది. తెలంగాణ రాష్ట్రం నాగార్జున సాగర్ గిరిజన కాలనీకి చెందిన ఎం.లింగమ్మ(40) తన భర్తతో మోటారుసైకిల్‌పై యర్రగొండపాలెం వస్తోంది. మెట్టబోడు తండా వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను తప్పించబోయి బోల్తా పడింది. ఈ సంఘటనలో లింగమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్న సమయంలో ఆమె మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చౌడయ్య తెలిపారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సింగరాయకొండ: రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి(42) మృతదేహం లభ్యమైనట్లు జీఆర్పీ పోలీసులు ఆదివారం తెలిపారు. ఊళ్లపాలెం వెళ్లే రైల్వే బ్రిడ్జి సమీపంలో మృతదేహం పడి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. మృతుడి శరీరంపై లేత ఆకుపచ్చ రంగు చొక్కా, తెలుపు గీతలు గల నీలం రంగు ప్యాంట్ ఉన్నాయి. ఆచూకీ తెలిసిన వారు 9440627647, 9440887143, 7013915467ను సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతి చెందిన జాన్సన్

కొత్తపట్నం: భర్తతో మద్యం వ్యసనాన్ని మాన్పించాలని ఓ భార్య చేసిన ప్రయత్నం వికటించింది. భార్యతో కలిసి ప్రార్థన కోసం చర్చికి వచ్చిన భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వివరాలు.. సంతనూతలపాడు మండలం తక్కెళ్లపాడుకు చెందిన కనుమూరి జాన్సన్(37) కొరిశపాడు మండలం దైవాలరావూరులో కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. తాగుడుకు బానిసైన జాన్సన్ ఆరోగ్యం పాడు చేసుకుంటూ కుటుంబానికి చెడ్డపేరు తెస్తున్నాడు. ఎలాగైనా తాగుడు మాన్పించాలని భార్య మెర్సీరాణి అనేక ప్రయత్నాలు చేసింది. మురళీ అనే వ్యక్తి పరిచయమై ఈతముక్కల చర్చిలో ప్రార్థనకు తీసుకెళ్లాలని సలహా ఇచ్చాడు. గత నెల 22న ఈతముక్కలలో భార్యాభర్తలు చర్చికి వెళ్లారు. రెండు రోజులపాటు అక్కడే ఉన్న జాన్సన్ మనస్తాపం చెంది ఎవరూ లేని ప్రదేశంలో ఇనుప రాడ్డుకు ఉరివేసుకున్నాడు. స్థానికులు గమనించి ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. రెండు రోజుల అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై సుధాకర్‌బాబు వివరాలు సేకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

నిఘా నీడలో వసూళ్లు!

- సీసీ కెమెరాల పేరుతో నగదు వసూళ్లలో నిమగ్నమైన కింది స్థాయి పోలీసు సిబ్బంది
- దర్శిలో దుకాణాన్ని బట్టి రూ.వెయ్యి నుంచి రూ.5 వేల వరకు..
- కురిచేడు, తాళ్లూరులో దుకాణానికి రూ.4 వేల చొప్పున వసూలు
- బయటకు చెప్పుకోలేక అసహనం వ్యక్తం చేస్తున్న కొందరు వ్యాపారులు
- 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు నవంబర్ 2న గొట్టిపాటి లక్ష్మి ప్రకటన
- సొంత నిధులు ఖర్చు చేయకుండా ఈ అనధికార వసూళ్లేంటని విస్తుపోతున్న ప్రజలు


దర్శిలో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు



దర్శి: ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్నట్టుగా ఉంది దర్శి నియోజకవర్గంలో వ్యాపారుల పరిస్థితి. సీసీ కెమెరాల ఏర్పాటుపై దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ఇటీవల ఆర్భాటంగా చేసిన ఓ ప్రకటన నియోజకవర్గంలోని వ్యాపారుల చేతిచమురు వదిలిస్తోంది. దుకాణాన్ని బట్టి నగదు వసూలు చేసే బాధ్యతను ఏకంగా పోలీసులకే అప్పగించడం, వారు చేసేదేమీ లేక వ్యాపారుల వద్ద చేతులు చాపుతుండటం తీవ్ర చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే.. దర్శి నియోజకవర్గంలో 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి నవంబర్ 2వ తేదీన స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో పోలీసుల సమక్షంలో ప్రకటించారు. ఎస్పీ నుంచి అనుమతి తీసుకుని సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. దీంతో ప్రజలంతా గొట్టిపాటి లక్ష్మి సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారని భావించారు. అయితే సీసీ కెమెరాల ఏర్పాటుకు నగదు సర్దుబాటు చేయాలంటూ నియోజకవర్గంలోని వ్యాపారులకు పోలీసుల నుంచి సంకేతాలు వెళ్లాయి. సీసీ కెమెరాల ఏర్పాటు మంచి నిర్ణయమే అయినా ఆ బాధ్యత నేరుగా ప్రభుత్వం తీసుకోవాలి లేదంటే దాతల సాయంతో ఏర్పాటు చేయవచ్చు. పట్టణ భద్రతలో భాగంగా నగర పంచాయతీ నిధులను కూడా వినియోగించుకోవచ్చు. ఇవేవీ కాకుండా దుకాణదారుల నుంచి నగదు వసూలు చేయడం విమర్శలకు తావిస్తోంది. దర్శిలో డీఎస్పీ, సీఐకి తెలియకుండా క్రింది స్థాయి సిబ్బంది డబ్బు వసూలు చేస్తున్నట్లు సమాచారం. మరికొన్ని చోట్ల గతంలో దుకాణదారులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను తామే బిగించినట్లుగా లెక్కలు చూపుతున్నట్లు తెలిసింది. డబ్బు వసూలు చేస్తున్న పోలీసుల తీరుపై బయటకు చెప్పుకోలేక వ్యాపారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అందులోనూ రాజకీయాలు కలగలిపి నగదు వసూళ్లు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దుకాణాన్ని బట్టి నగదు

దర్శి, కురిచేడు, దొనకొండ, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లో 10 వేలకు పైగా దుకాణాలు ఉన్నాయి. దర్శిలో కొందరిని సీసీ కెమెరాలు అడగ్గా మరి కొందరి వద్ద మాత్రం వారు చేసే వ్యాపారాన్ని బట్టి రేటు నిర్ణయించారు. చిన్న చిన్న షాపులు, న్యూడిల్స్ బండ్లు లాంటి చిరు వ్యాపారులు రూ.1000, పెద్ద దుకాణాలైతే రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు. కురిచేడు మండలంలో దుకాణానికి రూ.4 వేలు తీసుకున్నారని వ్యాపారులు చెబుతున్నారు. దొనకొండ మండలంలో కొందరు వ్యాపారుల ద్వారా నేరుగా సీసీ కెమెరాలు తెప్పించగా మరి కొందరి నుంచి నగదు వసూలు చేస్తున్నారు. ముండ్లమూరు మండలంలో వ్యాపార దుకాణాలు తక్కువ ఉన్నాయి. దీంతో కొందరు వ్యాపారులు, మరి కొందరు రాజకీయ నాయకులు, దాతల సహకారంతో సీసీ కెమెరాలు తెప్పించి బిగిస్తున్నారు. తాళ్లూరుతో పాటు మండలంలో ప్రధాన వ్యాపార కూడలి అయిన తూర్పుగంగవరంలోనూ సీసీ కెమెరాల పేరుతో రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు వసూళ్లు కొనసాగుతున్నాయి. నగదు తీసుకున్నా ఫర్వాలేదు కానీ ఈ వసూళ్లలో పారదర్శకత పాటిస్తే పోలీసు శాఖకు చెడ్డపేరు రాకుండా ఉంటుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఫ్లెక్సీలు చింపేవాళ్ల కోసమేనా?

ఇటీవల జనసేన నాయకుడు వరికూటి నాగరాజు పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించేశారు. ఆ తరువాత టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి అభిమానులు నాలుగు సందర్భాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కూడా గుర్తు తెలియని వ్యక్తులు చించేశారు. ఈ పని ఎవరు చేశారో పోలీసుల దర్యాప్తులోనూ స్పష్టత రాలేదు. అయితే ఫ్లెక్సీలను మతిస్థిమితం లేని వ్యక్తి చించేసినట్లు పోలీసులు ప్రాథమికంగా ఓ అంచనాకు ఇచ్చినట్లు స్థానికంగా చర్చ నడుస్తోంది. వాస్తవానికి దర్శిలో గతంలో ఎంపీ ఇచ్చిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటిలో కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. ఈ క్రమంలోనే ఫ్లెక్సీల రగడ రాజుకోవడంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గొట్టిపాటి లక్ష్మి ఎస్పీని కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది.

పెళ్లి బస్సును ఢీకొన్న లారీ


బోల్తాపడిన పెళ్లి బస్సు

- 10 మందికి తీవ్ర, 35 మందికి స్వల్పంగా గాయాలు
- ప్రమాదం ధాటికి రోడ్డు పక్కన బోల్తా కొట్టిన ట్రావెల్ బస్సు
- శనివారం అర్ధరాత్రి మార్కాపురం-కంభం హైవేపై ఘటన


గాయపడిన నారాయణ


జీజీహెచ్‌లో చికిత్స పొందిన మనోహర్

మార్కాపురం రూరల్: ఆగి ఉన్న పెళ్లి బస్సును లారీ ఢీకొనడంతో 10 మందికి గాయాలయ్యాయి. మండలంలోని మిట్టమీదిపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మార్కాపురం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం బీజంవేముల గ్రామానికి చెందిన పెళ్లి బృందం పల్నాడు జిల్లా నరసరావుపేటలో వివాహానికి హాజరై తిరుగు ప్రయాణంలో ఉన్నారు. ఈ క్రమంలో మార్కాపురం-కంభం మధ్య మిట్టమీదిపల్లి క్రాస్ రోడ్డు వద్ద బస్సులోని కొంత మంది కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఆపారు. ఇదే సమయంలో మార్కాపురం నుంచి కంభం వైపు వేగంగా వెళ్తున్న ఐషర్ లారీ ఒక్కసారిగా ఢీకొట్టడంతో బస్సులో కూర్చుని ఉన్న 10 మందికి తీవ్ర గాయాలు కాగా, మరో 35 మంది స్వల్పగాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మార్కాపురం జీజీహెచ్‌కు తరలించి ప్రథమ చికిత్స అందించారు. ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చికిత్స అనంతరం వారు తమ స్వగ్రామానికి మరో వాహనంలో వెళ్లారు. గాయపడి చికిత్స పొందిన వారిలో మనోహర్, రాకేష్, రాజబాబు, వసంతరాయలు, హరిబాబు, గుణలక్ష్మి, జానకి, శివమ్మ, రాధాకృష్ణ, నారాయణ ఉన్నారు. మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మహేష్ (ఫైల్)

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం కందుకూరు పట్టణంలో చోటుచేసుకుంది. కందుకూరు మండలం మోపాడు గ్రామానికి చెందిన తోకల మహేష్ (32) కందుకూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు చెక్‌పోస్టు వద్ద సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం కందుకూరు నుంచి చెక్‌పోస్టు వద్ద విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో ఓవీ రోడ్డులోని గాయత్రీ కాలేజీ వద్దకు చేరుకోగానే వెనుకవైపు నుంచి కారు బలంగా ఢీకొట్టింది. దీంతో మహేష్ ఒక్కసారిగా రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆటోలో ఏరియా హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతుడు మహేష్‌కి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కందుకూరు రూరల్ పోలీస్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తగా

మృతుడు మహేష్ వైఎస్సార్ సీపీలో బలమైన కార్యకర్తగా ఉన్నారు. పార్టీ తరఫున సోషల్‌మీడియా విభాగంలో గత కొన్నేళ్లుగా సేవలందిస్తున్నాడు. మహేష్ మృతిపై పలువురు నాయకులు, సోషల్‌మీడియా కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

కరాటేలో పొదిలి విద్యార్థుల ప్రతిభ


టీం కటా విభాగంలో బంగారు పతకం సాధించిన పొదిలి విద్యార్థులు

పొదిలి రూరల్: జాతీయ స్థాయి 9వ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో పొదిలికి చెందిన ముగ్గురు విద్యార్థులు సత్తా చాటారు. ఆదివారం మంగళగిరిలోని షాదీఖానాలో నిర్వహించిన ఈ పోటీల్లో టీం కటా విభాగంలో నగిరికంటి వెంకట నాగ సాయిప్రతీక్, కీర్తిక, యర్రంరెడ్డి జయసాయి విష్ణువర్ధన్‌రెడ్డి బంగారు పతకం కైవసం చేసుకున్నారు. అంతే కాకుండా వ్యక్తిగత కటా విభాగం(పదేళ్లలోపు)లో కీర్తిక బంగారు పతకం, సాయి ప్రతీక్ కాంస్య పతకం(11 ఏళ్లలోపు), యర్రంరెడ్డి జయసాయి విష్ణువర్ధన్ రెడ్డి కాంస్య పతకం(పదేళ్లలోపు) సాధించారు. కరాటే మాస్టర్ వేణును విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

అక్రమ మద్యం స్వాధీనం

- ముగ్గురు నిందితులు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పొదిలి రూరల్: పొదిలి ఎక్సైజ్ కార్యాలయ పరిధిలో బెల్ట్ షాపులపై ఆదివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందంతో పాటు సీఐ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పొదిలి మండలంలోని మాదాలవారిపాలెం, హనుమంతుని పాడు మండలంలోని హాజీపురం, కూటగుళ్ల గ్రామాల్లో బెల్ట్ షాపులపై దాడి చేయగా ఒకరి వద్ద 48, మరొకరి వద్ద 42, ఇంకో వ్యక్తి వద్ద 10 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

104 సిబ్బందికి వెయిటేజ్‌తో ఉద్యోగాలివ్వాలి


ధర్నాలో పాల్గొన్న 104 ఉద్యోగుల యూనియన్ నాయకులు

ఒంగోలు టౌన్: 104 అత్యవసర సేవల సిబ్బందికి వెయిటేజ్ కల్పించి ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు కోరారు. 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. 104 సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజారోగ్య రంగంలో సేవలందిస్తున్న ఉద్యోగులను బానిసలుగా చూడటం సరికాదన్నారు. గత ప్రభుత్వం అంగీకరించిన శ్లాబ్ సిస్టంను అమలు చేయడం లేదని చెప్పారు. ఉద్యోగుల పీఎఫ్, ఈఎస్ఐ సొమ్మును రికవరీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గత నెల రోజులుగా వివిధ పద్ధతుల్లో సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వంగానీ, యాజమాన్యంగానీ స్పందించకపోవడం విచారకరమని యూనియన్ కార్యదర్శి కె.రవి వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో యూనియన్ నాయకులు శ్రీధర్ రెడ్డి, నరేంద్ర, సుబ్బయ్య, శ్రీకాంత్, ఉదయ భాస్కర్, మహిళా ప్రతినిధులు స్వాతి, శ్వేత, పావని తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాలలో అఘోరి నాగసాధు


అఘోరి ప్రయాణిస్తున్న కారు

- శ్రీశైలం వెళ్తూ ఫారెస్టు చెక్ పోస్టు వద్ద ఆగిన వైనం
- రాత్రి వేళ అనుమతి లేకపోవడంతో 7 గంటలపాటు నిరీక్షణ


కారులో ఉన్న అఘోరి నాగసాధు

పెద్దదోర్నాల: అఘోరి నాగసాధు శనివారం రాత్రి దోర్నాల మండలంలో ప్రత్యక్షమయ్యారు. మహానందిలో దైవదర్శనం ముగించుకున్న అనంతరం కారులో శ్రీశైలం పుణ్యక్షేత్రానికి బయలుదేరిన ఆమె గణపతి ఫారెస్ట్ చెక్ పోస్టు వద్ద ఆగిపోయారు. శనివారం రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు శ్రీశైలం ఘాట్ రోడ్డులోకి అనుమతులు లేవని అటవీశాఖ అధికారులు తెలియజేయడంతో చెక్‌పోస్టు వద్దే రాత్రంతా కారులో నిరీక్షించారు. అఘోరీని చూసేందుకు స్థానికులతో పాటు నిలిచిన వాహనాల్లో యాత్రికులు ఎగబడటంతో రద్దీ నెలకొంది. దీంతో మొబైల్ పోలీసు వాహన సిబ్బంది అక్కడికి చేరుకుని గుమిగూడిన ప్రజలను పంపించివేశారు. ఆదివారం ఉదయం 6 గంటలకు హైవే మొబైల్ పోలీసులు వెంట రాగా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి బయలుదేరి వెళ్లారు.